క్లుప్తంగా...

కీసర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా స్వప్నరెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న స్వప్నరెడ్డి

కీసర: కీసర మండలం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పైల్ల స్వప్నరెడ్డి ఎన్నికయ్యారు. మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోల లక్ష్మీ ఆమెకు నియామక పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తాననే నమ్మకంతో తనకు ఈ బాధ్యతలు అప్పజెప్పినందుకు ధన్యవాదాలు తెలిపారు.

గోధుమకుంటలో గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ మహేందర్‌రెడ్డి

కీసర: గోధుమకుంట గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ మహేందర్ రెడ్డి అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, ప్రజల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ కిరణ్‌జ్యోతి, కార్యదర్శి సురేశ్‌రెడ్డి, వార్డు సభ్యులు బాల్‌రాజ్, శేఖర్, రజిత, రమేశ్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, సంధ్య, దశరథగౌడ్, పద్మ, స్వరూప, శివయాదవ్, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



మేడ్చల్‌రూరల్: మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో బుధవారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పలు బూత్‌ల పరిధిలో గడపగడపకూ వెళ్లి ప్రధాని మోదీ, బీజేపీ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, విజయాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు సరస్వతి, హంసరాణి, జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు పట్టణ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌దాస్, వంశీ, రవీందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో విద్యార్థులకు బస్‌పాస్‌లు




బస్‌పాస్‌లు అందజేస్తున్న ఆంజనేయులుగౌడ్, వినోద్‌కుమార్

ఘట్‌కేసర్: జెడ్పీ కొర్రెముల్ బాలురు, బాలికలకు చౌదరిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట ఆంజనేయులుగౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్ ఆర్టీసీ బస్‌పాస్‌లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆర్థిక భారం పడకుండా ఆర్టీసీకి సొంత డబ్బులు చెల్లించి బస్‌పాస్‌లు అందజేశామన్నారు. కాంగ్రెస్ నాయకులు బాబురావు, జంగయ్య, మహేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బక్రీద్ ప్రార్థనలకు ఏర్పాట్లు

ఘట్‌కేసర్: పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఈద్గాలో బక్రీద్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్‌తో కలిసి ఈద్గా చదును పనులు బుధవారం పరిశీలించారు. జామా మజీద్ కమిటీ అధ్యక్షుడు అన్నుబాయ్, మున్సిపాలిటీ బ్రాండ్ అంబాసిడర్ సిరాజ్, షకీల్, విజయ్, శంకర్‌ముదిరాజ్, పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్ కేంద్ర విద్యాలయంలో స్కౌట్స్, గైడ్స్‌లో గల క్లబ్, బుల్ బుల్ ప్రాథమిక విభాగంలో ఉత్తమమైన గోల్డ్ ఆరో అవార్డులు బుధవారం అందజేశారు. ఎన్ఎఫ్‌సీనగర్ పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపిక కాగా వారికి ప్రశంస పత్రాలతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్‌సీనగర్ కేవీ స్కూల్ ఇన్‌చార్జ్ విక్టర్ ఇమానియల్, సాత్విక్, అంకిత్ కుమార్, మల్లికార్జున్, సాత్విక్, సురేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

అడ్డగోలుగా.. అంతస్తులు




మైసమ్మగూడలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలు

2 అంతస్తుల వరకు అనుమతి..
4 అంతస్తులకు పైగా నిర్మాణాలు

- పుట్టగొడుగుల్లా హాస్టళ్ల భవనాలు
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం..
- ధనార్జనే భవన యజమానుల లక్ష్యం
- పుష్కలంగా నాయకుల అండదండలు
- భారీగా దండుకుంటున్న అధికారులు
- నోటీసులతోనే సరి.. కూల్చివేతలు నో..
- గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో జోరుగా అక్రమ నిర్మాణాలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. నగర శివారు మున్సిపాలిటీ కావడంతో శరవేగంగా అభివృద్ధి చెందుతుండగా అంతే వేగంగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. సామాన్య ప్రజలు తమ మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతోందని సంతోషించాలో లేక మున్సిపాలిటీ ఆదాయానికి ఆర్థికంగా గండి పడుతోందని ఆందోళన వ్యక్తం చేయాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఇక అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే అండగా నిలవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి.



పుట్టగొడుగుల్లా..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, మైసమ్మగూడ, సుతారిగూడ, బాసిరేగడి, జ్ఞానాపూర్, అర్కలగూడ గ్రామాలు ఉన్నాయి. నగర శివార్లలో ఉండటంతో గేటెడ్ కమ్యూనిటీలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలకు నిలయంగా మారి మున్సిపాలిటీకి ఆదాయ వనరులు మెండుగా ఉన్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఎక్కువ శాతం అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతుండగా అరకొరగా అనుమతులు పొందిన వారు సైతం గృహ నిర్మాణ అనుమతులు తీసుకుని కమర్షియల్ కట్టడాలు చేపడుతున్నారు. దీంతో మున్సిపాలిటీ అక్రమార్కులకు అడ్డాగా మారింది.

విద్యార్థుల ప్రాణాలతో చలగాటమా..?

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మైసమ్మగూడలో పెద్ద ఎత్తున విద్యా సంస్థలు ఉండటంతో అక్రమార్కులకు మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా మారింది. దూర ప్రాంతాల నుంచి చదువుకునేందుకు వచ్చే విద్యార్థులు నివాసం ఉండేందుగా పెద్ద ఎత్తున ప్రైవేటు హాస్టళ్లు వెలుస్తున్నాయి. హాస్టల్ నిర్మాణం కోసం భవనం నిర్మాణం చేపడుతున్న వారు రెండతస్తుల నిర్మాణం కోసం అనుమతులు పొంది ఐదు నుంచి ఆరు అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. ధనార్జనే ధేయంగా ఆ నిర్మాణాలు సైతం హాస్టల్ భవనాల నిబంధనలకు విరుద్ధంగా చేపడుతూ విద్యార్థుల ప్రాణాల ముప్పు వాటిల్లేలా ఏర్పాటు చేస్తున్నారు.

అధికారులు, నాయకుల అండదండలు..

మున్సిపాలిటీ ఆదాయానికి గండికొడుతూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారికి అధికారులు, నాయకుల అండదండలు సైతం మెండుగానే కనిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారు స్థానిక కౌన్సిలర్లకు ఎంతో కొంత ముట్టజెబుతుండటంతో వారు నోరు మెదకుండా వారికి సహకారం అందిస్తుండగా, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపి మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడకుండా చూడాల్సిన మున్సిపల్ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి, పాలకవర్గ సభ్యుల ఒత్తిళ్ల తలొగ్గి అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అక్రమ కట్టడాలపై ఎవరైనా ప్రశ్నించినా తాము చర్యలు చేపడుతున్నాం అని చెప్పుకునేందుకు, తమకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందుగా నోటీసు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకుంటున్నారే తప్ప నిర్మాణాలను అడ్డుకోవడం లేదు. దీంతో భవన యజమానులు చకచకా నిర్మాణాలు పూర్తి చేసేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపడతాం

మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారిని గుర్తించి వారికి నోటీసులు జారీ చేస్తాం. అనుమతులు తీసుకునే వరకు పనులు చేయవద్దని నిర్మాణదారులకు ఆదేశాలు జారీ చేశాం. మైసమ్మగూడలో హాస్టళ్ల నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్న వారికి సైతం ఇదివరకే నోటీసులు ఇచ్చాం. అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

– రాములు, మున్సిపల్ కమిషనర్, గుండ్లపోచంపల్లి

జవహర్‌నగర్‌ను సుందరంగా తీర్చిదిద్దుతాం

మేయర్ కావ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 3వ డివిజన్ కార్పొరేటర్ బల్లి రోజాశ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో కేఎన్ఆర్‌కాలనీలో నిర్మించే భూగర్భ డ్రైనేజీ పనులను బుధవారం మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లోని ప్రతి డివిజన్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే జవహర్‌నగర్ అభివృద్ధి చెందిందన్నారు. మురుగురహిత నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నంగునూరి అశోక్‌గుప్తా, సిద్దులు యాదవ్, బండకింది ప్రసాద్‌గౌడ్, సోమయ్య, వెంకటేష్, శ్రీనివాస్, ప్రభాకర్, కిరణ్, జనార్దన్, శ్యామల, అనిత, అరుణ, రజియాబేగం, కాలనీవాసులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

కీసర: మండల కేంద్రమైన కీసరలో తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామపంచాయతీ నిధులను వెచ్చించి పనులు చేపడుతున్నట్లు గ్రామసర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్ అన్నారు. బుధవారం కీసరలో ఆమె మాట్లాడుతూ మండల కేంద్రమైన కీసరలో 2011 జనాభా ప్రాతిపదికన మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోందని, ఇటీవల గ్రామంలో పెద్దఎత్తున గృహనివాసాలు పెరిగిపోయాయన్నారు. ప్రజల అవసరాల మేరకు నీటి సరఫరా చేయలేకపోతున్నామన్నారు. దీనికి తోడు మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్లు మరమ్మతులకు గురవుతున్నప్పుడు గ్రామస్తులకు రెండు మూడు రోజులు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. దీంతో ఇటీవల కాలంలో పంచాయతీ పాలకవర్గం సమావేశంలో గ్రామంలోని వివిధ వార్డుల్లో ఎక్కడ నీటికి ఇబ్బంది ఉందో అక్కడ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సూచన మేరకు కొత్తగా బోర్లు వేయడం, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇటీవల కీసరలోని వెంకటసాయిథియేటర్ కాలనీ సమీపంలో, చాకరికుంట సమీపంలో కొత్తగా బోరు వేయడం జరిగిందన్నారు. శివాజీనగర్‌కాలనీలో రెండు బోరు మోటర్లకు మరమ్మతులు, కీసర చౌరస్తాలో యాదవబస్తీలో నీటి సరఫరా కోసం కొత్తగా బోరు మోటారు బిగించినట్లు చెప్పారు.

మున్సిపల్ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నాగారం మున్సిపల్ కౌన్సిలర్

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో అవసరం లేనిచోట రూ.లక్షల మున్సిపల్ నిధులను కేటాయించి పనులు చేపట్టేందుకు మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డితో పాటు మున్సిపల్ అధికారులు తీసుకుంటున్న చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నాగారం మున్సిపల్ కౌన్సిలర్ చింతల సరితారమేష్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలు.. కీసర మండలం గోధుమకుంట గ్రామం నాగారం మున్సిపాలిటీ రాంపల్లి సరిహద్దులో దాదాపు 60 ఎకరాల్లో కొందరు రియల్టర్లు ఎలిఫెంట్ వెంచర్ పేరుతో కొంత మేర హెచ్ఎండీఏ అనుమతులు తీసుకొని, మరి కొంత మేర అక్రమ లేఅవుట్ రూపొందిస్తున్నారన్నారు. నాగారం మున్సిపల్ రాంపల్లి రెవెన్యూ సర్వే నెంబర్లు 758, 759, 760, 761ల్లో సుమారు 15 ఎకరాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణాలు చేసి రియల్టర్లు విక్రయించారన్నారు. సదరు లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత సదరు లేఅవుట్ ఏర్పాటు చేసిన వ్యక్తులకే బాధ్యత ఉందన్నారు. కానీ స్థానిక కౌన్సిలరు, మున్సిపల్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు లేఅవుట్ నిర్మాణదారుడితో లోపాయకారి ఒప్పందం కుదుర్చుకొని మున్సిపల్ నుంచి సుమారు రూ.25 లక్షల మేర నిధులు కేటాయించి డ్రైనేజీ పనులు చేపట్టాలని నిర్ణయించారన్నారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించే మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి సంబంధించి కౌన్సిలర్లకు అజెండా పంపి అందులో సదరు అంశం చేర్చడం జరిగిందన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి మున్సిపల్ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యన్, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, కుమార్, శ్రీశైలం, బలరాం, విఘ్నేష్, నరేందర్, శ్రీధర్, పరమేష్ పాల్గొన్నారు.

25 ఏళ్లుగా ప్రజాజీవితంలో..

మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ స్థానిక కౌన్సిలర్ అభ్యర్థన మేరకు ఆ వార్డు పరిధిలో ఎక్కడ ప్రజల అవసరాలు ఉంటాయో అక్కడ పనులు చేపట్టేందుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం మేరకు నిధులు కేటాయించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఎలాంటి లోపాయికారి ఒప్పందాలు చేసుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. తాము 25 ఏళ్లుగా ప్రజాజీవితంలో ఉన్నామని, వార్డు సభ్యుడిగా మొదలుకొని ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్‌గా ప్రజల ఆశీస్సులతో ముందుకు వెళ్తున్నట్లు, కొందరి విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



ఘట్‌కేసర్: పట్టణంలోని ఎన్ఎఫ్‌సీనగర్ రైల్వే వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ మహేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌కు చెందిన నలుగురు యువకులు కారులో నగరంలోని రామంతాపూర్‌కు బయల్దేరారు. బుధవారం తెల్లవారుజామున వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఎన్ఎఫ్‌సీనగర్ రైల్వే వంతెనపై ముందు వెళ్తున్న లారీని వెనుక వైపు నుంచి కారుతో ఢీకొట్టారు. కారు నడుపుతున్న అఖిల్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. నిద్రమత్తులో ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుంటలో పడి వ్యక్తి మృతి



రషీద్ హుస్సేన్ (ఫైల్)

మేడ్చల్‌రూరల్: స్నానానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం అస్సాం రాష్ట్రానికి చెందిన రషీద్ హుస్సేన్(48) ఏడాది క్రితం బతుకుదెరువుకు మేడ్చల్‌కు వలస వచ్చి మండలంలోని రావల్‌కోల్ గ్రామ శివార్లలో నివాసం ఉంటూ కిష్టాపూర్‌లోని సింగానియా చాక్లెట్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తోటి కార్మికులతో కలిసి తమ అద్దె గదికి సమీపంలో ఉన్న రావల్‌కోల్ వాగు కుంటలో నిత్యం స్నానానికి వెళ్తుంటారు. బుధవారం ఉదయం తోటి కార్మికులతో కలిసి కుంట వద్దకు స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడి మునిగిపోయాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న మేడ్చల్ పోలీసులు ఫైర్ సిబ్బంది సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం లభ్యం కావడంతో గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో నాలుగు గేదెలు మృతి

శామీర్‌పేట్: విద్యుత్ షాక్‌తో నాలుగు గేదెలు మృతి చెందిన ఘటన బుధవారం తూంకుంట మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతాయిపల్లికి చెందిన చింతల భాస్కర్ రెడ్డి వ్యవసాయమే జీవనాధారం, వ్యవసాయంతో పాటు తనకున్న నాలుగు గేదెలను మేపుతుంటాడు. బుధవారం పక్కనే ఉన్న నాగరాజు పొలంలోకి వెళ్లాయి. ఈ క్రమంలో ఒక్కసారిగా అరుస్తూ కింద పడిపోవడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు గుర్తించి, విద్యుత్, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న అధికారులు పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

గ్రూప్–4 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రూప్–4 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జులై 1వ తేదీన జరిగే గ్రూప్–4 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రూప్–4 పరీక్షను టీఎస్‌పీఎస్సీ నిబంధనల మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయటంతోపాటు అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చూడాలన్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 90,220 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతుండగా, 187 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ గైడ్‌లైన్స్‌ను ప్రతి ఒక్కరూ చదివి, సూచనలను పాటించాలన్నారు. లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షా కేంద్రాలను ముందస్తుగా సందర్శించి తాగునీటి, విద్యుత్, సీటింగ్, సీసీ కెమెరాలు, మౌలిక వసతులను చూసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు ఉంటుందన్నారు. పోలీస్ బందోబస్తుతో పాటు పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను తనిఖీ చేసి పంపాలన్నారు. పరీక్షా కేంద్రం గేటు మూసిన తర్వాత అభ్యర్థులను లోపలికి అనుమతించకూడదని సూచించారు. పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలను పోలీసుల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూం నుంచి తరలించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, చీఫ్ సూపరింటెండెంట్, లైజనింగ్ అధికారులు, రూట్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

వైభవం.. జగన్నాథుడి రథయాత్ర





మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలో బుధవారం జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగింది. హరే క్రిష్ణ సేవా సమాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన రథయాత్ర పట్టణంలోని చంద్రానగర్ కాలనీ నుంచి ప్రారంభమై పలు కాలనీలు, జాతీయ రహదారి, ప్రధాన కూడళ్ల మీదుగా ఆర్టీసీ కాలనీ వరకు నిర్వహించారు. రథయాత్రలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని భజనలు చేశారు. మహిళలు కోలాటం, నృత్యాలతో ఆకట్టుకున్నారు. దీంతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

సొంత డబ్బుతో వీధి దీపాలు ఏర్పాటు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ మూడో వార్డు కౌన్సిలర్ బొక్క సంగీతప్రభాకర్‌రెడ్డి తన వార్డులో సొంత డబ్బుతో బుధవారం నూతన విద్యుత్ లైన్, విద్యుత్ బల్బులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి పనులు పర్యవేక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాత్రి సమయంలో ప్రజల ఇక్కట్లును గమనించి వీధి దీపాల సమస్యలను పరిష్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు జంగారెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.



మూడో వార్డులో విద్యుత్ పనులు పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

అరుంధతినగర్ ప్రభుత్వ భూమిలో గుడిసెల తొలగింపు



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ అరుంధతినగర్ సర్వే నెంబర్–770, 771, 767, 706 పార్ట్ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వెలిసిన గుడిసెలను తహసీల్దార్ ఆదేశాల మేరకు పోలీసుల సహాయంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ సిబ్బందితో కలిసి కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలంలో ఎలాంటి గుడిసెలు వేయరాదని, అక్రమ నిర్మాణాలను నిర్మిస్తే సహించబోమని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సహాయకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆస్తులకు రక్షణ లేకుండా పోయింది..

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న నిరుపేద కుటుంబానికి జవహర్‌నగర్ కార్పొరేషన్ అరుంధతినగర్‌లో 1988లో అప్పటి ప్రభుత్వం స్థలాలు కేటాయించిందని, ప్రభుత్వం కేటాయించిన స్థలంలో నివసిస్తున్న పేద ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి అన్నారు. అరుంధతినగర్‌లో గుడిసెలు తొలగిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న ఆయన అక్కడకు చేరుకొని బాధితులను పరామర్శించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందన్నారు.

ఉచితంగా నీళ్లు అని చెప్పి బిల్లుల వసూలా..?

శామీర్‌పేట్: ఉచిత నీటి సరఫరా అని చెప్పి బిల్లులు వసూలు చేయడం మంత్రి అసమర్థ పాలనకు నిదర్శనమని టీపీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీలో నల్లా బిల్లుల రద్దుకు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రమంతటా ఉచితంగా నీటిని సరఫరా చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే సీఎం కేసీఆర్, ప్రస్తుతం మున్సిపాలిటీల్లో నల్లా బిల్లులు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం తూంకుంట మున్సిపాలిటీ కార్యాలయం నుంచి హెచ్ఎండబ్ల్యూఎస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, టీపీసీసీ మెంబర్ చంద్రశేఖర్, తూంకుంట మున్సిపాలిటీ కౌన్సిలర్ మధుసూదన్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పంది మాంసంతో నూనె

తయారీదారుడిని అరెస్టు చేసిన రాచకొండ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: పంది మాంసం వ్యర్థాలతో ఆయిల్ తయారు చేసి విక్రయిస్తున్న నిందితుడిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. మల్కాజ్‌గిరి స్పెషల్ ఆపరేషన్ టీం(ఎస్ఓటీ) పోలీసుల వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్కేపురంకు చెందిన రమేష్ శివ పంది కొవ్వు నుంచి నూనె తయారు చేస్తున్నాడు. దీన్ని స్థానికంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకులకు విక్రయిస్తున్నాడు. అలాగే కొంతమంది రైతులు దీన్ని తీసుకువెళ్లి వస్త్రాలకు పోసి పంటకు రక్షణగా ఇతర జంతువులు రాకుండా కట్టడానికి తీసుకెళ్తున్నారు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు రమేష్ ఇంటిపై ఆకస్మికంగా దాడి చేశారు. నిందితుడి నుంచి 15 లీటర్ల కల్తీ నూనెను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితుడిని నేరేడ్‌మెట్ పోలీసులకు అప్పగించారు. ఇలాంటి కల్తీ నూనెతో తయారు చేసే ఆహారం తినడం వల్ల అనారోగ్యం పాలవడమే కాకుండా ఈ నూనె నుంచి వచ్చే దుర్వాసనతో మనుషులకు, జంతువులకు అంటు వ్యాధులు ప్రబలుతాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఘనంగా పీవీ నర్సింహారావు జయంతి

శామీర్‌పేట్: దేశ ప్రజానీకానికి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందించిన మహనీయుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని తూంకుంట మున్సిపాలిటీ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, టీపీసీసీ మెంబర్ చంద్రశేఖర్, తూంకుంట మున్సిపాలిటీ కౌన్సిలర్ మధుసూదన్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.